

సెల్‌ఫోన్ వెలుగుల్లో ఆందోళన కొనసాగిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీలో టెన్షన్

సెమిస్టర్ వాయిదా వేయాలని అర్ధరాత్రి వరకు విద్యార్థుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో శుక్రవారం అర్ధరాత్రి వరకు ఉద్రిక్తత నెలకొంది. సెమిస్టర్‌ను వాయిదా వేయాలని సైన్స్ విద్యార్థులు అడ్మిన్ బిల్డింగ్‌ను ముట్టడించారు. ఈ నెల 18 నుంచి మొదటి, మూడవ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. అదే సమయంలో పలు పోటీ పరీక్షలు ఉండడంతో ఈ సెమిస్టర్‌ను వాయిదా వేయాలని రెండు రోజులుగా విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆందోళనను ఉధృతం చేశారు.

భార్యపై దాడి 6

చనిపోయిందనుకుని పోలీస్‌స్టేషన్‌కు..



సర్వర్‌లో సాంకేతిక సమస్యలు

- ట్యాంకర్ల బుకింగ్‌కు ఇబ్బందులు
- గంట పాటు పని చేయని టోల్ ఫ్రీ నంబర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగర తాగునీటి, మురుగునీటి నిర్వహణలో వినియోగదారులకు సేవ లందించే వాటర్‌బోర్డు వెబ్‌సైట్ శుక్రవారం మొరాయించింది. దీంతో నీటి ట్యాంకర్ బుకింగ్‌కు ఇబ్బందులు తలెత్తాయి. నీటి బిల్లుల చెల్లింపులూ జరగలేదు. పక్షం రోజుల క్రితం వాటర్‌బోర్డు వెబ్‌సైట్, సర్వర్ హ్యాక్ అవడంతో ప్రైవేటు ప్రకటనలు రావడంతో పాటు సాంకేతిక సమస్యలు తలెత్తగా, తాజాగా వాటర్‌బోర్డు సర్వర్ మొరాయించడంతో వెబ్‌సైట్ పని చేయలేదు. ఈ సమస్యను విన్నవించేందుకు వాటర్‌బోర్డు టోల్‌ఫ్రీ నంబర్ 155313ని సంప్రదించేందుకు పలువురు కాల్ చేసినా అదీ పని చేయలేదు. శుక్రవారం ఉదయం 9.30గంటల నుంచి 10.25గంటల వరకు గంట పాటు టోల్ ఫ్రీ నంబర్ పనిచేయలేదని వినియోగదారులు తెలిపారు. వాటర్‌బోర్డు వెబ్‌సైట్ ద్వారా, మొబైల్‌లోని వాటర్‌బోర్డు యాప్ ద్వారా నీటి ట్యాంకర్ బుక్ చేసుకునే సదుపాయం ఉన్నది. సాంకేతిక సమస్యలతో అవి పనిచేయకపోవడంతో శుక్రవారం రెండు, మూడు గంటల పాటు ట్యాంకర్ బుకింగ్‌లు జరగలేదు. కొద్దిసేపు టోల్ ఫ్రీ నంబర్ కూడా పనిచేయకపోవడంతో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక కొందరు వినియోగదారులు తలపట్టుకున్నారు.



మస్త్.. జబర్దస్త్

ఐదు దశాబ్దాల క్రితం చలామణిలో ఉన్న రెండు పైసల నాణేలను ప్రత్యక్షంగా తిలకించేలా భారీ ఆకారంలో రూపొందించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఏర్పాటు చేసిన ఈ కళాఖండం అందరినీ ఆకర్షిస్తూ సెల్ఫీలు దిగేలా చేస్తోంది.

వేసవి ఆరంభానికి ముందే సూరీడు భగ్గుమంటున్నాడు. ఎండ వేడిమికి నగర ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నమోదవుతున్నాయి. ఫలితంగా వాహనదారులు మధ్యాహ్న వేళ పరిమిత సంఖ్యలోనే రోడ్లపైకి వస్తున్నారు. శుక్రవారం సచివాలయం వద్ద రోడ్డు ఇలా నిర్మానుష్యంగా మారింది. మరోవైపు ఐటీ సెక్టార్‌లో యువతులు ఇలా గొడుగుతో రోడ్లపై వెళుతూ కనిపించారు.



'ఫ్రై' డే

నిబంధనలు బేఖాతర్

అనుభవం లేని డ్రైవర్లు.. పరిమితికి మించి విద్యార్థులు



బడంగ్‌పేట్‌లోని ఓ స్కూల్‌కు చెందిన వ్యాన్‌లో 15 మందికి పైగా విద్యార్థులను శుక్రవారం తరలిస్తున్న దృశ్యం. వ్యాను పైనా, డిక్కీలో, సైడ్ డోరు వద్ద విద్యార్థులను ప్రమాదకరంగా కూర్చుండబెట్టడం గమనార్హం!

> విద్యాసంస్థలకు చెందిన వాహనాలు నిబంధనలను బేఖాతరు చేస్తున్నా ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడం లేదు. ఏడాదికోమారు మాత్రమే ఫిట్‌నెస్ తనిఖీలు చేస్తూ మమ అనిపిస్తున్నారు. అనుభవం లేని డ్రైవర్లు కాలం చెల్లిన వాహనాలతో ప్రమాదాలను సృష్టిస్తున్నారు. వాహన పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తూ ప్రమాదాల బారిన పడేలా చేస్తున్నారు.

- వ్యాన్లు, ఆటోల్లో మరీ ఘోరం
- రెట్టింపు సంఖ్యలో విద్యార్థులను తీసుకెళ్తోన్న వైనం
- విద్యాసంస్థల వాహనాలకు ఏడాదికి ఒక్కసారే తనిఖీలు
- తరచూ చిన్నారులను బలిగొంటున్నా పట్టని వైనం
- ప్రమాదాలు జరిగినపుడే అధికారుల హడావిడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): 'విద్యాసంస్థల బస్సులు ప్రమాణాల మేరకు ఉన్నాయా..? వాటిని నడిపే డ్రైవర్లు అర్హులేనా..? నిబంధనలు పాటిస్తున్నారా..? వ్యాన్లు, ఆటోల్లో పరిమితి మేరకే విద్యార్థులను తీసుకెళ్తున్నారా..? ఆ వాహనాలకు ఫిట్‌నెస్ ఉందా..?' అన్నది రవాణా శాఖ అధికారులు నిరంతరం తనిఖీ చేయాలి. కానీ డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ వంటి పనులు.. వాటిలో వచ్చే అక్రమార్జనపైనే వారికి ఆసక్తి. విద్యా సంవత్సరం ఆరంభం.. దుర్ఘటనలు జరిగినప్పుడు మాత్రమే తనిఖీల పేరిట హడావిడి చేస్తున్నారు. మిగతా రోజుల్లో షరా మామూలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. దీంతో అభం, శుభం తెలియని విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారు. గురువారం హయత్‌నగర్‌లో ఓ ప్రైవేట్ బస్సు వాహనం కింద పడి నాలుగేళ్ల చిన్నారి రిత్విక మరణించింది. వెంటనే రవాణాశాఖ మేల్కొంది. శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యాసంస్థల బస్సులు, పిల్లలను తీసుకెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

పరిశీలించాల్సింది..

వాహనాలకు సంబంధించి కేవలం ఫిట్‌నెస్ మాత్రమే పరిశీలిస్తే చాలదు. విద్యాసంస్థల డ్రైవర్ల అనుభవం, అర్హత వంటివి పరిశీలించాలి. నిబంధనల ప్రకారం ఐదేళ్ల అనుభవంతో లైసెన్స్ ఉన్న వారిని డ్రైవర్లుగా నియమించాలి. అతి వేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో చలాన పడిన వారిని నియమించకూడదు. డ్రైవర్లుగా పని చేస్తోన్న సమయంలో అయా ఉల్లంఘనలకు సంబంధించి వారికి చలానా విధిస్తే ఉద్యోగం నుంచి తొలగించాలి.

అనుభవం, అర్హత లేకున్నా...

మెజార్టీ ప్రైవేట్ విద్యాసంస్థలు తక్కువ వేతనానికి

మిగతా 6వ పేజీలో..

మూసీ పునర్జీవంపై పార్లమెంట్‌లో ప్రస్తావన

- 'జాతీయ నదీ పునర్జీవం'లో చేర్చాలని ఎంపీ అనిల్ డిమాండ్



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మూసీనది పునర్జీవంపై రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ పార్లమెంట్‌లో ప్రస్తావించారు. శుక్రవారం జీరో అవర్‌లో మాట్లాడిన అనిల్‌కుమార్ యాదవ్.. మూసీనదిని జాతీయ నదీ పునర్జీవం పథకంలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగిన ఆయన పార్లమెంట్‌లో మాట్లాడేందుకు దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మూసీ విశిష్టతను, పునర్జీవం ఆవశ్యకతలను వివరించే ప్రయత్నం చేశారు. మూసీనదికి గొప్ప చరిత్ర ఉందని, ఒకనాడు హైదరాబాద్ తాగునీటికి, వ్యవసాయానికి దోహదపడిన మూసీనది ప్రస్తుతం పూర్తిగా కలుషితమై మురుగు నాలాగా మారిందని తెలిపారు. హైదరాబాద్ నగర విస్తరణలో పలు కంపెనీల కాలుష్య వ్యర్థాలు, సీవరేజ్ వ్యర్థాలు మూసీలో కలుస్తున్నాయని, దీని పరివాహక ప్రాంతాల్లో జీవనోపాధి దెబ్బతిన్నదని వివరించారు. మూసీనదికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, మూసీనది అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం తగిన నిధులిచ్చి సహకరించాలని డిమాండ్ చేశారు. మూసీనది పునర్జీవంతో నగరవాసులకు, రైతులకు, గంగపుత్రులకు జీవనోపాధి మెరుగవుతుందని తెలిపారు.

హెచ్-సిటీలో ముందడుగు

- అమీన్‌పూర్ రహదారి విస్తరణకు మూడు సంస్థల బిడ్‌లు
- త్వరలో మొదటి దశ టెండర్ నోటిఫికేషన్
- సీఎంతో సమావేశం అనంతరం స్పష్టత

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(హెచ్-సిటీ)లో మొదటి అడుగుపడింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బావిస్తోన్న ప్రాజెక్టులో ఏజెన్సీ ఎంపిక దిశగా కసరత్తు మొదలైంది. జాతీయ రహదారి -65 మియాపూర్ నుంచి అమీన్‌పూర్ మార్గంలో రూ.45 కోట్లతో చేపట్టనున్న 120/100 అడుగుల రహదారి విస్తరణ పనులకు మూడు సంస్థలు బిడ్‌లు దాఖలు చేశాయి. సాంకేతిక, ఆర్థిక పరిశీలన అనంతరం తక్కువ కోట్ చేసిన సంస్థను ఎంపిక చేయనున్నట్టు ఇంజనీరింగ్ విభాగం వర్గాలు తెలిపాయి. మొదటిదశలో మరికొన్ని ప్రాంతాల్లో పనుల కోసం టెండర్లు పిలిచేందుకు జీహెచ్‌ఎంసీ కసరత్తు చేస్తోంది. ఈనెల 16న ఫాక్స్ సాగర్‌పై రూ.56 కోట్లతో ప్రతిపాదించిన స్టీల్‌బ్రిడ్జి నిర్మాణానికి బిడ్‌లు ఆహ్వానించే అవకాశముంది. వాస్తవంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి హెచ్-సిటీ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించాల్సి ఉంది. ఢిల్లీ పర్యటన నేపథ్యంలో మీటింగ్ వాయిదా పడింది. సీఎంతో సమావేశం అనంతరం దీనిపై స్పష్టత వస్తుందని సంస్థ వర్గాలు పేర్కొంటున్నాయి. మొదటి దశలో రేతిబౌలి-నానల్‌నగర్, పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సీఎల్, బంజారాహిల్స్ టీవీ-9, ఖాజాగూడ, ఐఐటీ, విప్రో జంక్షన్ల వద్ద వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికీ త్వరలో టెండర్ ప్రకటించనున్నారు. కేబీఆర్ పార్కు చుట్టూ పనులకు టెండర్ నోటిఫికేషన్ ఇవాల్సి ఉన్నా.. కేసు విచారణలో ఉన్న నేపథ్యంలో కోర్టు ఆదేశాల కోసం అధికారులు వేచి చూస్తున్నారు.

త్వరలో టెండర్ ప్రకటించనున్న ప్రాజెక్టులు..

- నానల్‌నగర్- రేతిబౌలి జంక్షన్‌లో రూ.398 కోట్లతో వంతెన, గ్రేడ్ సెపరేటర్
- పంజాగుట్ట ఎన్‌ఎఫ్‌సీఎల్, టీవీ-9 జంక్షన్ల వద్ద రూ.210 కోట్లతో వంతెన, అండర్‌పాస్
- ఖాజాగూడ, ఐఐటీ, విప్రో జంక్షన్ల వద్ద రూ.837 కోట్లతో వంతెన, గ్రేడ్ సెపరేటర్లు

తాతను పొడిచి చంపిన మనవడు



- అడ్డుకోబోయిన తల్లికీ కత్తిపోట్లు
- ఆస్తి వివాదం నేపథ్యంలో ఘటన
- పోలీసుల అదుపులో నిందితుడు

పంజాగుట్ట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. ఆస్తి పంచి ఇవ్వడం లేదని తాతను సొంత మనవడే కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. అడ్డుకోబోయిన తల్లిని కూడా పొడిచాడు. ఈ సంఘటన గురువారం రాత్రి బేగంపేట ప్రజాభవన్ ఎదురుగా ఉన్న వీధిలో చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెలమాటి చంద్రశేఖర జనార్దన్‌రావు(86)కు పటాన్‌చెరు, బాలానగర్ పారిశ్రామికవాడల్లో ఇంజనీరింగ్ పరిశ్రమలు ఉన్నాయి. ఆయన కుమార్తె సరోజినీదేవి. భర్తతో విభేదాలు రావడంతో తండ్రి ఇంటి వద్దే ఉంటున్నది. ఆమె కుమారుడు కిలారు కీర్తితేజ(29) తల్లిదండ్రులతో కాకుండా వేరేగా ఉంటున్నాడు. కొంతకాలంగా ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం జనార్దన్‌రావు మనవడు కీర్తితేజకు రూ.నాలుగు కోట్ల వరకు డబ్బులు ఇచ్చాడు. తనకు ఇంకా డబ్బులు కావాలని, తనను సరిగ్గా పెంచలేదని తాతతో తరచూ గొడవ పడేవాడు. గురువారం రాత్రి

మిగతా 6వ పేజీలో..

డబుల్ డెక్కర్ బస్సులకు బోర్డులు

- స్టాపుల వివరాలూ డిస్‌ప్లే



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): 'ఉచిత ప్రయాణం.. నిష్ప్రయోజనం' పేరిట 'ఆంధ్రజ్యోతి' బుధవారం ప్రచురించిన కథనంపై హెచ్ఎండీఏ స్పందించింది. ఈ బస్సులు ఏఏ మార్గాల్లో ప్రయాణం చేస్తాయో.. వివరాలతో కూడిన ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసింది. స్టాప్‌ల పేర్లను సైతం అధికారులు బోర్డుపై పొందుపరిచారు. ఉచిత ప్రయాణమని రాశారు. డబుల్ డెక్కర్ బస్సులకు ఇప్పటి వరకు అధికారులు ప్రచారాన్ని కల్పించలేదు. నగర అందాలను, పర్యాటక స్థలాలను ఉచితంగా చూపించేందుకు హెచ్ఎండీఏ అందుబాటులోకి తీసుకొచ్చిన డబుల్ డెక్కర్ బస్సులు ప్రయాణికులు లేకుండా ఖాళీగా తిరుగుతున్నాయి. ఇందుకు గల కారణాలను విశ్లేషిస్తూ.. 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో అధికారులు తాజాగా చర్యలు తీసుకున్నారు. ప్రజలకు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేశారు.

జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పోటీచేస్తాం

జనసేన రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్

హైదరాబాద్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తాము పోటీ చేస్తామని తెలంగాణ జనసేన ఇన్‌చార్జి వేమూరి శంకర్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో జనసేన పార్టీకి ఎన్నికల సంఘం గాజు గ్లాసు గుర్తు కేటాయించిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో తమది రిజిస్టర్డ్ పార్టీ నుంచి గుర్తింపు పొందిన పార్టీగా మారిందని ఆయన వివరించారు.

మెట్టుగూడలో కత్తుల దాడి..

అంతా కట్టుకథ

- బాధితుడే నిందితుడు
- ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం
- అడ్డువచ్చిన తల్లిపై కత్తితో దాడి

6



1942..!

ఓ ప్రాజెక్టు కోసం తొలగించే చెట్ల సంఖ్య

- కేబీఆర్ పార్కు చుట్టూ గుర్తింపు
- 1300 వరకు కొనోకార్పస్ రకం చెట్లు
- మరో 642 చెట్ల ట్రాన్స్‌ఫరీలొకేషన్
- పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో రూ.1090 కోట్లతో ప్రాజెక్టులు
- రోడ్డు విస్తరణకు మార్కింగ్ పూర్తి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు చుట్టూ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం 1942 చెట్లు తొలగించాల్సి ఉంటుందని జీహెచ్‌ఎంసీ గుర్తించింది. ఈ మేరకు పార్కు చుట్టూ రహదారికి ఇరువైపులా, సెంట్రల్ మీడియన్‌లో ఉన్న చెట్లకు మార్కింగ్ చేశారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)లో భాగంగా పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్లలో సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం కోసం వంతెనలు, అండర్ పాస్‌లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రూ.1090 కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టులకు సర్కారు గతంలో పాలనాపరమైన అనుమతులు జారీ చేసింది. క్షేత్ర స్థాయిలో పనులు ప్రారంభించేందుకు బల్దియా కసరత్తు మొదలు పెట్టింది.

మెజార్టీ కొనోకార్పస్ చెట్లు

కేబీఆర్ పార్కు చుట్టూ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. పర్యావరణంపై ప్రభావం పడకుండా, న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా జాతీయ ఉద్యానవనం

మిగతా 6వ పేజీలో..

కోర్టు కేసులతో..

హెచ్-సిటీ మొదటిదశలో కేబీఆర్ పార్కు చుట్టూ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కోర్టు కేసుల నేపథ్యంలో టెండర్ నోటిఫికేషన్ జారీని వాయిదా వేశారు. గత ప్రభుత్వం పార్కు వైపు ఉన్న వాక్ వేను కూడా ప్రాజెక్టుల కోసం సేకరించాలని నిర్ణయించడంతో 2015-16లో పర్యావరణవేత్తలు హైకోర్టుకు వెళ్లారు. కొందరు ఎన్‌జీటీని ఆశ్రయించారు. దీంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. ఇప్పటికీ కేసు విచారణలో ఉంది. 'వచ్చే బుధవారం కోర్టులో విచారణ ఉంది. న్యాయస్థానం స్పందనను బట్టి టెండర్ ఎప్పుడు ప్రకటించాలన్నది నిర్ణయిస్తాం. సానుకూల సంకేతాలు వస్తే ఈనెల చివరి వారంలో బిడ్‌లు ఆహ్వానిస్తాం' అని ఓ అధికారి తెలిపారు.

ప్రియుడి వేధింపులు భరించలేక

విద్యార్థిని ఆత్మహత్య



బౌద్ధనగర్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ప్రియుడి వేధింపులు భరించలేక ఓ నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదులు, అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మేస్త్రీ పనిచేసే మచా నాగయ్య తన కుమారుడు, కుమార్తెతో బౌద్ధనగర్ పరిధిలో ఉంటున్నాడు. నాగయ్య కుమార్తె మచా ప్రవళ్లిక(23) కోఠి ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. సాయంత్రం వేళలో వారాసిగూడలో ఓ ఆస్పత్రిలో పార్ట్‌టైమ్ జాబ్ చేస్తోంది. ప్రవళ్లిక, సుజన్ అనే యువకుడు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. గత కొన్నిరోజుల నుంచి సుజన్

మిగతా 6వ పేజీలో..

ప్రియుడి వేధింపులు భరించలేక విద్యార్థిని ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

ప్రవల్లికను అనుమానిస్తూ, వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. ఈనెల ఆరవతేదీ గురువారం సాయంత్రం ఓయూలో వారిరువురి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మరో స్నేహితుడు మధుకర్‌ను పిలిపించగా ఇద్దరినీ సముదాయించాడు. ఆదేరోజు రాత్రి నాగయ్య తాను ఫంక్షన్‌కు వెళ్తున్నానని, ఆలస్యంగా వస్తానని ప్రవల్లికకు ఫోన్ ద్వారా తెలిపాడు. కుమారుడు ఉద్యోగానికి వెళ్లటంతో ఇంట్లో ప్రవల్లిక ఒక్కతే ఉంది. ఫంక్షన్ నుంచి అర్ధరాత్రి ఇంటికి వచ్చిన నాగయ్యకు ప్రవల్లిక ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సహాయంతో ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ప్రవల్లిక స్నేహితుడు మధుకర్.. నాగయ్యతో అతని కుమార్తె ప్రేమ విషయం, ప్రియుడితో ఉన్న గొడవలను తెలిపాడు. నాగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు సృజన్‌పై కేసును నమోదు చేశారు.

నిబంధనలు బేఖాతర్

(5వ పేజీ తరువాయి)

పనిచేసే రెండు, మూడేళ్ల అనుభవం ఉన్న వారిని డ్రైవర్లుగా నియమించుకుంటున్నారు. బస్సుల ఫిట్‌నెస్ ఏడాదికోసారి తనిఖీ చేసే అధికారులు.. డ్రైవర్లు నిబంధనలు పాటిస్తున్నారా..? బస్సులు ప్రమాణాల ప్రకారం ఉన్నాయా..? అన్నది మెజార్టీ ఆర్‌టీఓలు పట్టించుకోవడం లేదు. 'గ్రేటర్‌లోని దాదాపు అన్ని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకున్నారు. అందుకే తనిఖీలు ఆపేశాం' అని అధికారులు గతంలో పేర్కొన్నారు. కార్యాలయంలో కూర్చొని కాసులు వచ్చే పనులకే వారు పరిమితమవుతున్నారు.

పరిమితికి మించి..

వ్యాన్లు, ఆటోలు వంటి వాహనాల్లో చాలామంది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్తుంటారు. ఇందులో మెజార్టీ వ్యాన్లు కాలం చెల్లినవే. 15 యేళ్లు ముగిసిన వాహనాలను తక్కువకు కొనుగోలు చేసి విద్యార్థులను తీసుకెళ్లేందుకు వినియోగిస్తున్నారు. ఆటోలదీ అదే పరిస్థితి. ఆటోల్లో 6, వ్యాన్లలో 10 మంది విద్యార్థులను మాత్రమే తీసుకెళ్లాలి. కానీ రెట్టింపు కంటే ఎక్కువ సంఖ్యలో విద్యార్థులను తీసుకెళ్తున్నారు. ఇది అత్యంత ప్రమాకరంగా మారుతోంది. కొందరు రెండు, మూడు పాఠశాలలకు విద్యార్థులను తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో సమయంలోపు పిల్లలను తీసుకెళ్లేందుకు అతివేగంగా వాహనాలు నడపుతున్నారు. అయినా రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

మెట్టుగూడలో కత్తుల దాడి..

అంతా కట్టుకథ

- బాధితుడే నిందితుడు
- ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం
- అడ్డువచ్చిన తల్లిపై కత్తితో దాడి



గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేణుక, యశ్వంత్

బౌద్ధనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడలోని ఓ ఇంట్లో దుండగులు చొరబడి తల్లి, కుమారుడిపై కత్తులతో దాడి చేసింది అంతా కట్టుకథేనని చిలకలగూడ పోలీసులు తేల్చారు. తల్లి ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న యశ్వంత్ కూరగాయలు కోసే చాకుతో పొడుచుకుని ఆత్మాహత్యాయత్నానికి పాల్పడగా, అడ్డువచ్చిన తల్లి రేణుకపై కత్తితో దాడి చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు, విశ్వసనీయ సమాచారం ప్రకారం.. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధి మెట్టుగూడలో రేణుక ముగ్గురు కుమారులతో నివసిస్తుంది. మొదటి కుమారుడు యశ్వంత్ (31), రెండో కుమారుడు యశ్‌పాల్‌కు వివాహం కాలేదు. మూడో కుమారుడు వినయ్‌కు వివాహమైంది. ఇంటిపై మరో అంతస్తును నిర్మించాల ని, ఎన్నిరోజులు ఖాళీగా ఉంటావని, ఏదో ఉద్యోగం చూసుకుని వివా హం చేసుకోవాలని యశ్వంత్‌తో రేణుక ప్రతీ రోజు వాదించేది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న యశ్వంత్ ఇంట్లో తల్లి వేధింపులు ఎక్కువ కావడంతో గురువారం ఉదయం ఇద్దరు తమ్ముళ్లు బయటకు వెళ్లిన అనంతరం ఇంటి తలుపులు పెట్టి కూరగాయలు కోసే చాకుతో కడుపులో పొడుచుకున్నాడు. దీనిని అడ్డుకోబోయిన తల్లిపై చాకుతో దాడి చేశాడు. గట్టిగా ఆర్తనాదాలు వినిపించడంతో స్థానికులు వెళ్లి చూడగా ఇంటిలోపల తలుపు గడియపెట్టి ఉందని, కొద్దిసేపటి తర్వాత తలుపులు తెరుచుకోగా రేణుక, యశ్వంత్ రక్తపుమడుగులో పడి ఉన్నారు. వెంటనే వారిని అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఘటనలో వినియోగించిన చాకును పోలీసులు స్వాధీనం చేసుకుని వేలిముద్రలను ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపారు. బాధితుడే నిందితుడిగా పోలీసులు గుర్తించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రేణుక, యశ్వంత్‌లు ఇప్పుడిప్పుడు కోలుకుంటున్నారని, వారికి ప్రాణప్రాయంలేదని వైద్యులు తెలిపారు.

భార్యపై దాడి..

చనిపోయిందనుకుని పోలీస్‌స్టేషన్‌కు..

- దంపతుల మధ్య వాగ్వాదంతో ఘటన

దిల్‌సుఖ్‌నగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య వివాదం చివరికి ఒకరిపై దాడికి దారి తీసింది. కోపంతో ఊగిపోయిన భర్త భార్యపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. చైతన్యపురి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. స్థానిక ఆర్‌కేపురం రోడ్ నెంబర్3లో పబ్బు వెంకటేష్(36) సునీత దంపతులు ఉంటున్నారు. వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య సునీతపై అనుమానం పెంచుకున్న వెంకటేష్ ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. వాగ్వాదం పెరగడంతో కోపంతో ఊగిపోయిన అతడు భార్యపై విచక్షణారహితంగా దాడిచేశాడు. సునీత అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో భయపడి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. భార్య ప్రవర్తనపై అనుమానం రావడంతో ప్రశ్నించానని, గొడవ పెద్దది కావడంతో దాడి చేయాల్సి వచ్చిందని పోలీసులకు చెప్పాడు. వెంటనే సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు తలకు గాయాలైన సునీతను కొత్తపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ప్రాణాపాయం తప్పినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వెంకటేష్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అయితే, మొదట్లో వెంకటేష్ ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోగా ఘటన జరిగిన ప్రాంతం చైతన్యపురి పీఎస్ పరిధిలోకి వస్తుండడంతో కేసును అక్కడికి బదిలీ చేశారు.

తాతను పొడిచి చంపిన మనవడు

(5వ పేజీ తరువాయి)

11 గంటల ప్రాంతంలో తాత జనార్దన్‌రావు ఇంటికి వచ్చిన కీర్తి తేజ తనకు ఆస్తి పంచి ఇవ్వాలని ఆయనతో ఘర్షణ పడ్డాడు. తల్లి అతన్ని వారించింది. కోపంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో పలుమార్లు తాతను పొడిచాడు. తల్లి అడ్డుకోబోగా ఆమెను కూడా పొడిచాడు. తీవ్రంగా గాయపడ్డ జనార్దన్ రావు అక్కడికక్కడే మృతి చెందాడు. తేరుకున్న తల్లి సరోజినీదేవి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. చికిత్స నిమిత్తం ఆమెను ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి కుమారుడు వెలమాటి గంగాధర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కీర్తి తేజను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

1942..!

(5వ పేజీ తరువాయి)

అయిన కేబీఆర్ పార్కు వైపు కాకుండా.. మరోవైపు రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం 80 అడుగులు ఉన్న రోడ్డును 120 అడుగుల మేర వెడల్పు చేయనున్నారు. వాక్ వేను కూడా ముట్టుకోమని, రోడ్డుకు మరో వైపు ఉన్న ఆస్తులు సేకరిస్తామని ఇంజనీరింగ్ విభాగం అధికారొకరు తెలిపారు. ఇప్పటికే ఆస్తుల సేకరణకు సంబంధించిన ప్రక్రియ షురూ చేశారు. మహారాజ్ అగ్రసేన్ జంక్షన్ నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్ వరకు 120అడుగుల మేర రహదారి విస్తరించనున్న నేపథ్యంలో రోడ్డుకు ఒకవైపు ఉన్న భవనాలకు మార్కింగ్ చేశారు. ఈ క్రమంలో పార్కు వైపు ఫుట్‌పాత్‌పై, సెంట్రల్ మీడియన్, భవనాలున్న వైపు మొత్తం 1942 చెట్లు తొలగించాల్సి ఉంటుందని గుర్తించారు. 1942 చెట్లలో దాదాపు 1300 కొనో కార్పస్ రకం ఉండగా.. మరో 642 చెట్లలో మెజార్టీ పొగడ, ఇతర రకాలున్నాయి. కొనోకార్పస్ చెట్లు నాటడంపై ఇప్పటికే నిషేదం ఉంది. అటవీశాఖ అనుమతితో వీటిని తొలగించనున్నారు. పొగడ రకం చెట్లను ట్రాన్స్‌లోకేట్ చేయాలని భావిస్తున్నారు. అక్కడక్కడా ఉన్న గుల్మోహర్ రకం చెట్లను తొలగిస్తారు.

రమాబాయికు నివాళి



రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహనీయుల జయంత్యుత్సవ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలను శుక్రవారం రాజేంద్రనగర్ అంబేద్కర్ విగ్రహం ఆవరణలో నిర్వహించారు. రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంత్యుత్సవాల కమిటీ అధ్యక్షుడు పచ్చ నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కాడి సూర్యం ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. అట్టడుగు వర్గాల పేదల కోసం రమాబాయి తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో మహనీయుల జయంత్యుత్సవాల కమిటీ నాయకులు డాక్టర్ వి.శ్రీరాములు, పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, గొడుగు సంజీవ, వీర్లపల్లి నవీన్, బండి నర్సింహ, గోల్కొండ ఉపేందర్, చంద్రశేఖర్, బీఆర్ సుమన్, కనకమామిడి ప్రవీణ్ కుమార్, పత్యార నర్సింహ, సంతోష్, శంకర్, చాంది, జేమ్స్ పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి



కేంద్రమంత్రి చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెరుకుల సుగుణపతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి చెరుకుల సుగుణపతి డిమాండ్ చేశారు. క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. బీసీ కులగణన చేపడితేనే దేశంలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ మేరకు న్యూఢిల్లీలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణతో కలిసి పలువురు కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల ఎంపీలను కలిసి విన్నవించినట్టు శుక్రవారం బషీర్‌బాగ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు. బీసీల డిమాండ్లపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు పూర్తిగా విజయవంతమైందని తెలిపారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లకై రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, హైకోర్టు, సుప్రీంకోర్టు జడ్జీల నియామకాల్లో బీసీలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని, కేంద్రంలోని వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

ఐఐఆర్ఆర్‌లో సాయిల్ సైన్స్ ల్యాబ్ ప్రారంభం



సాయిల్ సైన్స్ ల్యాబోరేటరీని ప్రారంభిస్తున్న ఐఐఆర్ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరం, చిత్రంలో డాక్టర్ ప్రసాద్ బాబు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నేల స్వభావాన్ని పరిశీలించి దానికి తగ్గట్టు పంటలను వేయడానికి గాను ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని రాజేంద్రనగర్‌లోని భారత జాతీయ వరి పరిశోధనా సంస్థ (ఐఐఆర్ఆర్) డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షీ సుందరం తెలిపారు. ఐఐఆర్ఆర్‌లో పునర్నిర్మాణం చేసిన మృత్తికశాస్త్ర విభాగానికి చెందిన ప్రయోగశాల, పరిశోధన కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. జాతీయ స్థాయిలో పేరుగల వరి పరిశోధన సంస్థలో సాయిల్ సైన్స్ విభాగానిది కీలక పాత్ర అన్నారు. నేల స్వభావం గురించి తెలుసుకొని ఆ నేలలో ఏఏ ఎరువులు వేయాలి, ఎంత మోతాదులో వేయాలి అనే విషయాలను తెలుసుకోవడానికి సాయిల్ సైన్స్ ల్యాబ్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. నూతన సాంకేతిక పద్ధతులతో లాబొరేటరీని నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సాయిల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.బి.బి.ప్రసాద్ బాబు, డాక్టర్ సురేఖ, డాక్టర్ పిసి లత, బ్రజేంద్ర, బందెప్ప, గోపీనాథ్, పద్మజ పాల్గొన్నారు. వివిధ శాఖల విభాగాధిపతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉగ్గే శ్రీనివాస్ పటేల్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 5వేల కోట్ల నిధులు కేటాయించాలని, ఇచ్చిన హామీ నిలబెట్టుకోకపోతే ఈనెల 12న సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్ పటేల్ హెచ్చరించారు. మున్నూరుకాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యమైందని ఆరోపించారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే మున్నూరుకాపు కుల సంఘాల ప్రతినిధులను ఆహ్వానించి సమస్యలపై చర్చించి పరిష్కరించాలని కోరారు. మున్నూరుకాపులకు మంత్రి పదవి కేటాయించాలని, ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని, కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డును దేవాదాయ శాఖ పరిధి నుంచి తొలగించి మున్నూరుకాపులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘాల నేతలు బత్తుల రాములు, శ్యామ్‌కుమార్, సోమన్న, ప్రకాష్, మహేష్, ప్రభాకర్, శ్రీనివాస్, పత్తి అనిల్, సందీప్, మల్లేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శన



కృష్ణవేణి టాలెంట్ స్కూల్ మణికొండ బ్రాంచ్ లో శుక్రవారం సైన్స్ సినాప్స్ - 2025 నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్కూల్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కృష్ణవేణి స్కూల్స్ చైర్మన్ ఎం.ఎం.షరీఫ్, ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రదర్శించిన అంశాలు ఆలోచింపజేసేలా ఉన్నాయన్నారు. జోనల్ ఇన్‌చార్జి జహంగీర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. - నార్సింగ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి)

అడవి తల్లి.. గరిగుట్ట పెద్దమ్మ జాతర

● నేటి నుంచి ప్రారంభం



గరి గుట్ట పెద్దమ్మ ఆలయం

పహాడిషరీఫ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ మాదన్నగూడలోని గరిగుట్ట పెద్దమ్మ తల్లి కల్యాణ మహోత్సవాల(జాతర)కు ఆలయాన్ని ముస్తాబు చేశారు. శనివారం నుంచి మూడు రోజుల పాటు కనుల పండువగా జరుగనున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి వచ్చే అటవీ ప్రాంతంలోని చెట్లకు జాజు, సున్నంతో అందంగా అలంకరించారు. ఈ జాతరకు జల్‌పల్లి గ్రామంతో పాటు శ్రీరాంకాలనీ, మామిడిపల్లి, పహాడిషరీఫ్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. ఆలయ ప్రాంగణంలో విద్యుద్దీపాల ఏర్పాటు, మంచినీటి సదుపాయం కల్పించడం, పారిశుధ్య సమస్య తలెత్తకుండా మున్సిపాలిటీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

దట్టమైన అడవిలో పెద్దమ్మ తల్లి

జలపల్లి గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో దట్టమైన మాదన్నగూడ అటవీ ప్రాంతంలో గరిగుట్టపై పెద్దమ్మ అమ్మవారు కొలువుదీరారు. భారీ వన సంపద నడుమ వెలిసిన ఈ ఆలయంలో మ్మవారితో పాటు.. ఆలయ కుడి భాగంలో కొద్ది దూరంలో సమ్మక్క, సారక్కల గద్దెలు నెలకొల్పారు. అడవులకు రక్షణగా ఉండేలా ఈ అమ్మవార్లను ప్రతిష్ఠించినట్టు ప్రతీతి. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజు ఇక్కడ ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఏడాదికోసారి ఉత్సవాలు నిర్వహిస్తారు.

అధికారులు చర్యలు చేపట్టాలి



గరిగుట్ట పెద్దమ్మ కల్యాణ మహోత్సవం శనివారం, 9న బోనాలు, 10న అగ్నిగుండాల ప్రవేశం, సదరు పటం ఉంటాయి. ఒగ్గు కళాకారుల ఆటపాటలతో జాతరంతా సందడిగా మారనుంది. జల్‌పల్లి, శాతంరాయిల నుంచి ఆలయం వరకు శాశ్వత రోడ్డు మార్గం వేయాలి. జాతర సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా పోలీస్, మున్సిపాలిటీ శాఖలు తగిన చర్యలు చేపట్టాలి. ముఖ్యంగా అటవీ శాఖ అధికారులు తమకు పూర్తిస్థాయిలో సహకరించాలి.

- విఠల్బాబా, ఆలయ ధర్మకర్త

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఇన్‌కం టాక్స్ స్లాబ్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకున్న ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఉప్పుగూడ జెండా వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ చాంద్రాయణగుట్ట కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్, నాయకులు మాదరి చంద్రశేఖర్, బర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. - చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి)

మల్లు అనంతరాములు వర్ధంతి



మాజీ ఎంపీ దివంగత మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసిని వాళులర్పిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, టీపీసీసీ కార్యదర్శి మసీలాల్‌షా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎ.భాస్కర్, శ్రీశైలం, వెంకట్‌రెడ్డి తదితరులు

- అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి)

అంతర్జాతీయ స్థాయిలో అగ్రి వర్సిటీని తీర్చిదిద్దేందుకు కృషి



వ్యవసాయ వర్సిటీ ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య, ఉన్నతాధికారులతో సమావేశమైన అబర్న్ వర్సిటీ ఉన్నతాధికారులు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని వర్సిటీ ఉప కులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య తెలిపారు. అమెరికాలోని అబర్న్ విశ్వవిద్యాలయానికి చెందిన ఉన్నతస్థాయి అధికారుల బృందం శుక్రవారం ఉప కులపతి అల్దాస్ జానయ్య, విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులతో పరిపాలన భవనంలో సమావేశమయ్యారు. ఈసందర్భంగా జానయ్య మాట్లాడుతూ... అంతర్జాతీయ సంస్థలతో విస్తృతంగా ఒప్పందాలు కుదుర్చుకొని బోధన, పరిశోధన, రంగాల్లో పరస్పరం కలిసి పనిచేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమెరికా దేశంలోని అలబామా రాష్ట్రానికి చెందిన అబర్న్ విశ్వవిద్యాలయం ప్రతినిధి, మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జార్జ్ ఫ్లవర్స్ నేతృత్వంలో వచ్చిన ప్రతినిధి బృందం ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో అబర్న్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించడానికి వెళ్లారని వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అబర్న్ విశ్వవిద్యాలయంతో పాటు ఇతర ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు 8 నుంచి 10 మంది విద్యార్థులను పంపించడానికి ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్టు ఉపకులపతి తెలిపారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం.బలరాం, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎం.యాకాద్రి, డీన్ పీజీ స్టడీస్ డాక్టర్ కె.బి ఈశ్వరీ, ఉన్నతాధికారులు డాక్టర్ వి.రాములు, డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ జమునారాణి, అబర్న్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ షీనా స్టీవార్ట్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వృశాంక్ రామన్, డీన్ ఆఫ్ కాలేజీ ఆఫ్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డాక్టర్ జానకి అలవలపాటి, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్ కన్నన్ పాల్గొన్నారు.

57 ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లో పూర్తిగా వెనుకబడిన 57 ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 2వేల కోట్లు కేటాయించాలని ఎస్సీ 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బైరి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్లను 25 శాతానికి పెంచాలన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాల, మాదిగలతో కలపకుండా 57 ఎస్సీ ఉప కులాలను ప్రత్యేక గ్రూప్‌గా చేసి 7 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఉప కులాల జనాభా తక్కువగా చూపించడంవల్ల అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వాస్తవ జనాభా సేకరణ చేపట్టాలన్నారు. ఎస్సీ ఉప కులాలకు ఆర్డీవో ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తోందని, తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ ఉప కులాల నాయకులు వెంకన్న, సుద్దాల కుమారస్వామి, కె.శ్రీనివాస్, బత్తుల పాండు, కె.నవీన్, మహేష్, గణేష్, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు.

గోల్ఫ్ ఫైనల్లో వారియర్స్



వారియర్స్ జట్ల కెప్టెన్లు సురేష్, రణ్‌ధీర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో కళింగ వారియర్స్, కాంటినెంటల్ వారియర్స్ జట్లు ఫైనల్లో ప్రవేశించాయి. శుక్రవారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన సెమీఫైనల్లో వారియర్స్ జట్లు విజయం సాధించాయి. తొలి సెమీస్‌లో కళింగ వారియర్స్ 4-1తో ఆల్ఫా జట్టుపై, రెండో సెమీస్‌లో కాంటినెంటల్ వారియర్స్ 4-2తో షెర్పా జట్టుపై గెలుపొంది, ఫైనల్లో ప్రవేశించాయి.

మాదిగ అమరుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి



పొన్నాల సురేందర్ మాదిగ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

గోషామహల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు వర్గీకరణ విజయం అంకితమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. వర్గీకరణ పోరాటంలో భాగంగా 2009లో గాంధీభవన్ ఘటనలో సురేందర్ మాదిగ, మహేశ్ మాదిగ, దామోదర్ మాదిగలు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి త్యాగ ఫలితమే నేటి వర్గీకరణ అని మోత్కుపల్లి కీర్తించారు. ఈ సందర్భంగా పొన్నాల సురేందర్ మాదిగ, మహేశ్ మాదిగల తల్లిదండ్రులకు పాదాభివందనం చేశారు. మాదిగ అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పక్కా ఇళ్లు కట్టించాలని మోత్కుపల్లి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఉద్యమకారులపై ఉన్న కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు రుద్రవరం లింగస్వామి మాదిగ, వంగపల్లి శ్రీనివాస్, జిల్లా వెంకట్ మాదిగ, ప్రసాద్, ఎర్రోళ్ల భూపాల్, కొల్లూరి వెంకట్, నక్క వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి'

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బుద్వేల్ శ్రీకృష్ణా కాలనీలో రాజేంద్రనగర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు పనులు నాణ్యతగా వేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం రోడ్డు వేస్తున్న ప్రాంతం చాలా లోతుగా ఉంటుందని, పై నుంచి వరద నీరు ఆ రోడ్డు ద్వారా ఎక్కువగా వస్తోందని గుర్తుచేస్తున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండ జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉద్యోగులు లేక వెలవెల..

- బోసిపోయిన ఐసీడీఎస్ కార్యాలయం
- పనులపై వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు



అధికారులు లేక బోసిపోయిన కార్యాలయం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పలు విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆయారాం.. గయారాం.. అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది సమయపాలన పాటిస్తూ నిర్ణీత పనివేళలు ఉదయం 10గంటలకు హాజరుకావడం, సాయంత్రం 5 గంటలకు వెళ్తుండగా.. మరికొందరు వీటిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తాము వచ్చినప్పుడే డ్యూటీ అన్నమాదిరిగా చెలాయిస్తున్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్నేహ సిల్వర్‌జూబ్లీ బిల్డింగ్ నాలుగో అంతస్తులో ఉన్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ కార్యాలయం అధికారులు, ఉద్యోగులు లేక వెలవెలబోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. కార్యాలయంలో మొత్తం 20 మందికి పైగా పనిచేస్తుండగా.. ఒకరిద్దరు మినహా మిగతా వారెవ రూ సీట్లలో కనిపించలేదు. కార్యాలయంలో పనిచేసే ఓ ఉన్నతాధికారి ఇంటిలో జరిగిన గృహప్రవేశం నేపథ్యంలో వారందరూ వెళ్లినట్టు అక్కడకొచ్చిన వృద్ధులు, దివ్యాంగులు చర్చించుకున్నారు. ఉదయం 10గంటలకు వచ్చిన వారు 12 దాటకముందే శుభకార్యానికి వెళ్లడంతో పనుల నిమిత్తం వారు పడిగాపులు కాసిన పరిస్థితి నెలకొంది.

బాలరక్షక్ భవనానికి తాళం..

కాగా, ఐసీడీఎస్ ఆఫీస్‌తోపాటు పక్కనే ఉన్న బాలరక్షక్ భవన్ ఆఫీస్‌కు కూడా మధ్యాహ్నం 3 గంటలు కాకముందే తాళం వేసి ఉందని అక్కడికి వచ్చిన పలువురు తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన తాము అధికారులకు సమస్యలు చెప్పుకునే వీలు లేకుండా పోయిందన్నారు. ఐసీడీఎస్‌తోపాటు బాలరక్షక్ భవన్ అధికారులు, ఉద్యోగులందరూ.. అధికారి ఇంటిలో జరిగిన గృహప్రవేశానికి వెళ్లారా.. లేకుంటే ఇంకెక్కడి వెళ్లారో.. అనేది తెలియాల్సి ఉంది. కాగా, వారందరూ ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నారా.. లేకుంటే ఎవరికీ చెప్పకుండా మూకుమ్మడిగా విధులకు డుమ్మా కొట్టారా.. అనే దానిపై అధికారులు విచారణ చేస్తే బయటపడనుంది. ఐసీడీఎస్ ఆఫీస్‌లో ఉండే 1098 హెల్ప్‌లైన్‌కు పలు ఫిర్యాదులు కూడా వచ్చినట్టు తెలిసింది. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్న కలెక్టర్.. వీరి విషయంలో ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jofUqA2లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

గోరటి వెంకన్నకు కుసుమ ధర్మన్న జాతీయ జీవన సాఫల్య పురస్కారం

- ఈనెల 16న రవీంద్రభారతిలో అందజేత

రవీంద్రభారతి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ సాహితీవేత్త, సంఘ సంస్కర్త కుసుమ ధర్మన్న పేరిట ప్రతి ఏటా ప్రదానం చేస్తున్న ప్రతిష్ఠాత్మకమైన కుసుమ ధర్మన్న జాతీయ జీవన సాఫల్య పురస్కారాన్ని ఈ సారి ప్రముఖ కవి, వాగ్గేయకారుడు గోరటి వెంకన్నకు అందజేయనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గోరటి వెంకన్నతో పాటు రాయలసీకు చెందిన ప్రముఖకవి, విమర్శకులు డా.బీక్కి కృష్ణకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఈనెల 16న రవీంద్రభారతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఇరువురికి జాతీయ జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు రాధాకుసుమ తెలిపారు.

కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలి



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పటి నుంచి కష్టపడి చదివి ఆశించిన లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా గన్‌ఫౌండ్రీలోని మహబూబియా ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏవో హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతోపాటు అల్పాహారం అందిస్తున్నామన్నారు. ఎస్‌బీఐ ఏజీఎం సురేష్, ఎల్‌డీఎం సుబ్రహ్మణ్యం, డీఈఓ రోహిణి, హెచ్‌ఎం గిరిజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము పరిశీలన



రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోదామును శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించా రు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తును పరిశీలించారు. కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బి.రాములు ఉన్నారు. - రాజేంద్రనగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి)

'కాంగ్రెస్ పార్టీ ప్రజాగ్రహానికి గురైంది'

నార్సింగ్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏ క్షణమైనా బై ఎలక్షన్లు వస్తే బీఆర్ఎస్ పదికి పది సీట్లు గెలవడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బండ్లగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులతో పూర్తయిన బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ భవన నిర్మాణం ప్రారంభోత్సవంలో ఒక్క రూపాయి కూడా కాంగ్రెస్ పార్టీ వెచ్చించలేదన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని గ్రామాలకు నీటిని అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

ఒడిశా టు మహారాష్ట్ర..

● గంజాయి సరఫరాదారుడి అరెస్ట్ ● 200 కిలోల సరుకు స్వాధీనం

మదీన, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర గంజాయి సరఫరాదారుడిని సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ. 50 లక్షల విలువ చేసే సుమారు 200 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ వివరాలను వెల్లడించారు.

సంగారెడ్డిజిల్లా, నగిలిగిద్ద మండలం, మేఘ్యా నాయక్ తండాకు చెందిన జాదవ్ వసురామ్ కుమారుడు జాదవ్ శివరాం(34) డ్రైవర్. గంజాయి వ్యాపారం కూడా చేస్తుంటాడు. ఏపీలోని సీలేరు, అల్లూరి సీతారామరాజు జిల్లా, ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలించి ఎక్కువ ధరకు అమ్ముతుంటాడు. మూడు రోజుల క్రితం కారులో ఒడిశా వెళ్లి సుభాష్ అనే వ్యక్తిని సంప్రదించాడు. అతడి వద్ద కిలో గంజాయి రూ. 4 వేల చొప్పున 200 కిలోల గంజాయి కొనుగోలు చేసి శంషాబాద్ తీసుకొచ్చాడు. ఈనెల 5వ తేదీన తన వ్యాపార బాగస్వామి అయిన బానావత్ జైపాల్‌తో చర్చించాడు. అతడు ఎల్బీనగర్‌కు రమ్మని చెప్పగా.. కారులో గంజాయి తీసుకొని వెళ్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. విచారించగా.. 2015 నుంచి గంజాయి సరఫరా చేస్తున్నట్లు జాదవ్ శివరాం అంగీకరించాడు. స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు, రెండుసెల్‌ఫోన్ల విలువ సుమారు రూ. 50లక్షలు ఉంటుందని డీసీపీ తెలిపారు. జాదవ్‌ను రిమాండ్‌కు తరలించారు. సుభాష్, బానావత్ జైపాల్ పరారీలో ఉన్నారని వివరించారు. విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ టి.స్వామి, చాంద్రాయణగుట్ట ఏసీపీ కె.మనోజ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదబాబు, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ పాల్గొన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్, స్వాధీనం చేసుకున్న గంజాయి

1,132 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం

కార్వాన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): హాష్ ఆయిల్ విక్రయిస్తున్న వ్యక్తిని టప్పాచబుత్ర, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 1,132 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో కుల్సుంపురా ఏసీపీ మునావర్ అలీ వివరాలు వెల్లడించారు. ఒడిశా ప్రాంతానికి చెందిన లలిత్‌మండీ(22) కొంతకాలంగా టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో హాష్ ఆయిల్ విక్రయిస్తున్నాడు. ఇతడికి ఒడిశాకు చెందిన సరాతా పూజారి సహకరిస్తున్నాడు.

సమాచారం అందుకున్న పోలీసులు లలిత్‌మండీని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఒడిశా నుంచి హాష్ ఆయిల్ తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. అతడి నుంచి 1,132 గ్రాముల హ్యాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 11.32 లక్షలు ఉంటుందని ఏసీపీ తెలిపారు. సరాతా పూజారి పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీఐఈ విధానాలతో

పర్యావరణంపై ప్రభావం

● ఏఐజీ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ట్రోఇంటస్టినల్ ఎండోస్కోపీ (జీఐఈ) విధానాలు పర్యావరణంపై ప్రభావం చూపుతాయని ఏఐజీ ఆస్పత్రి నిర్వహించిన మార్గదర్శక అధ్యయనం ప్రతిష్ఠాత్మక జర్నల్ 'గట్'లో ప్రచురితమైంది. 'జీర్ణశయాంతర ఎండోస్కోపీ విధానాల కార్బన్ ఉద్గారాలు, పర్యావరణ ప్రభావం-భావి బహుళ-డైమెన్షనల్ అంచనా'పై ఈ అధ్యయనం కొనసాగింది. ఒక ఎండోస్కోపీ సాధారణంగా కార్బన్ ఉద్గారాలను ఎంత విడుదల చేస్తుందనే అంశాలపై పరిశోధన చేశారు. ఎండోస్కోపీ చేసేందుకు విడుదలయ్యే కార్బన్ ఉద్గారాల (కార్బన్ ఫుట్ ప్రింటింగ్) ప్రభావం పర్యావరణంపై ఏ మేరకు ఉంటుందనే అంశాలపై పరిశోధనలో అన్ని కోణాల నుంచి దృష్టి సారించారు. రీసైక్లింగ్‌తోపాటు మరికొన్ని పద్ధతులు అవలంబించి కార్బన్‌ను తగ్గించవచ్చని పరిశోధనలో తేల్చారు. 2023 మే 29 నుంచి జూన్ 10వ తేదీ వరకు చేసిన ఈ అధ్యయనంలో 3,244 మంది రోగులు, 3,873 వైద్య ప్రక్రియలపై పరిశోధన నిర్వహించినట్లు ఏఐజీ పేర్కొంది. గ్యాస్ట్రోఇంటస్టినల్ ఎండోస్కోపీ(జీఐఈ) విధానాలు పర్యావరణంపై ప్రభావాన్ని చూపుతాయని, ఒక్కో ప్రక్రియకు నగటున 38.45 కిలోల కార్బన్ ఉద్గారాల ప్రభావం ఉంటుందని పరిశోధనలో తేల్చారు. దాదాపు 17,500 పరిపక్వ చెట్ల ద్వారా దీనిని భర్తీ చేయడానికి అవకాశముందని తేల్చారు.

రీసైక్లింగ్‌తో..

రోగి ప్రయాణమే ఉద్గారాలకు అతిపెద్ద సమస్యగా అధ్యయనంలో గుర్తించారు. ప్రయాణ సంబంధిత ఉద్గారాలను తగ్గించడానికి స్థిరమైన రవాణా ఎంపికలు, మెరుగైన ఆరోగ్య సంరక్షణ అవసరమని నిర్ధారించారు. 27.5శాతం ఆస్పత్రి వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడంతో సహా భారతదేశ వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులు రెండు వారాల్లో 380 కిలోల సీవో2ఇ కార్బన్ ఉద్గారాలు ఆదా చేస్తాయని అధ్యయనం వెల్లడించింది. ఇది రీసైక్లింగ్ సానుకూల ప్రభావం, వ్యర్థాల నిర్వహణలో మరింత మెరుగుదలను వివరించింది.

పర్యావరణ అనుకూల పద్ధతులతో..

పరిశోధకులలో ఒకరైన ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్, డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఆరోగ్య సంరక్షణ కార్యకలాపాలతో ఆస్పత్రుల్లో పర్యావరణ ప్రభావం ఉంటుందని చెప్పారు. పర్యావరణ అనుకూల పద్ధతులను అవలంబించడం ద్వారా ఇబ్బందులను తగ్గించుకోవచ్చన్నారు. అధ్యయనం ప్రధాన పరిశోధకుడు డాక్టర్ హార్దిక్ రుఘ్వానీ మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణ పద్ధతుల్లో మార్పు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పరిశోధనలు వనరుల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడం, రీసైక్లింగ్‌ను ప్రోత్సహించడం, నాన్-ఇన్వాసివ్ డయాగ్నస్టిక్ ప్రత్యామ్నాయాలను అన్వేషించడం ముఖ్యమన్నారు.

రోగిని జీఐఈ విధానంలో పరీక్షిస్తే విడుదలయ్యే ఉద్గారాలు

కార్బన్ ఉద్గారాలు	శాతాల్లో
రోగి రాకపోకలు(పెట్రోల్, డీజిల్ వినియోగం వల్ల)	83.9
విద్యుత్ వినియోగం	10.42
మెడికల్ గ్యాసెస్, వాహనాలు, వ్యర్థాల వినియోగం	3.63
నీటి వినియోగం	1.86
డిటర్జెంట్, క్రిమిసంహారక వినియోగం	0.52
ఎండోస్కోప్స్, ఉపకరణాల రవాణా	0.41
వ్యర్థాల ఉద్గారాలు	0.025

రాష్ట్రస్థాయి పోలీస్ మీట్‌లో నగర పోలీసుల ప్రతిభ

క్రీడాకారులను అభినందించిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన ఒత్తిడిలో విధులు నిర్వహిస్తూ, క్రీడల్లో రాణించాలంటే అంకితభావంతోపాటు కఠినమైన శిక్షణ అవసరమని నగర సీపీ సీవీ ఆనంద్ అన్నారు. కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో పతకాలు సాధించిన సిబ్బంది, అధికారులను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిగా తన అనుభవాలను పంచుకున్నారు. క్రమశిక్షణ, జట్టుగా కలిసి పనిచేయడం, సవాళ్లను ఎదుర్కోవడం వంటి లక్షణాలు క్రీడల ద్వారా అలవడతాయన్నారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి స్పోర్ట్స్‌మీట్‌లో క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు పరిపాలన సహకారం అందిస్తామని సీపీ హామీ ఇచ్చారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోలీస్ మీట్‌లో నిర్వహించిన 26 విభాగాల్లో 236 మంది సిటీ పోలీసులు పాల్గొన్నారు. 9 ఓవరాల్ చాంపియన్‌షిప్ టైటిళ్లతోపాటు 67 స్వర్ణ, 32 రజత, 23 కాంస్య పతకాలు సాధించారు.

కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు ఎస్. భాస్కర్, కిషన్‌రావు, ఏసీపీలతో పాటు ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో పతకాలు సాధించిన సిబ్బందితో సీపీ సీవీ ఆనంద్, పోలీసు అధికారులు

కార్లు విక్రయిస్తామంటూ వ్యాపారికి టోకరా

● రూ. 37.95 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సగం ధరకే మంచి కండీషన్ ఉన్న సెకెండ్ హ్యాండ్ కార్లు విక్రయిస్తామంటూ నగరవాసిని సైబర్ నేరగాళ్లు బోల్తా కొట్టించి పలు దఫాలుగా రూ.37.95 లక్షలు వసూలు చేశారు. నగరానికి చెందిన వ్యాపారిని వాట్సాప్ నంబర్ల ద్వారా సైబర్ నేరగాళ్లు సంప్రదించారు. తాము వివిధ బ్యాంకుల్లో వేలం వేసిన కార్లు, భారీ వాహనాలు, ఎస్‌ కవేటర్లు, ఇతర వాహనాలను కొనుగోలు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తామని నమ్మించారు. సగం ధరకే మంచి కండీషన్‌లో ఉన్న సెకెండ్ హ్యాండ్ కార్లు వస్తాయని, వాహనాలు రేట్లను వాట్సాప్ ద్వారా పంపారు. వారి మాటలు నమ్మిన వ్యాపారి సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాల్లోకి ఆర్‌టీజీఎస్ ద్వారా డబ్బు బదిలీ చేశాడు. కొనుగోళ్లు, ట్రాన్స్‌పోర్టేషన్ పేరుతో పలుదఫాలుగా రూ.37.95 లక్షలు వసూలు చేశారు. ఇంకా డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

యువతిని మోసం చేసిన కానిస్టేబుల్

● ఆలస్యంగా వెలుగులోకి ఘటన

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రక్షకభటుడే భక్షకుడయ్యాడు. డబ్బుల విషయంలో వేధిస్తున్నారని ఫిర్యాదు చేయటానికి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన యువతిని ఓ కానిస్టేబుల్ సమస్య పరిష్కరిస్తానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. ఈ సంఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు చెందిన దళిత యువతి.. కొందరు డబ్బుల విషయమై వేధిస్తున్నారంటూ గత ఏడాది మార్చి 31న ఫిర్యాదు చేయటానికి తల్లితో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. సుధాకర్‌రెడ్డి అనే కానిస్టేబుల్ సమస్య పరిష్కరిస్తానని తన ఫోన్ నంబర్ తల్లీకుమార్తెలకు ఇచ్చి టచ్‌లో ఉండాలని చెప్పాడు. యువతి మరునటి రోజు సుధాకర్ రెడ్డికి ఫోన్ చేయగా.. డబ్బుల వ్యవహారం సివిల్ తగాదా కావటంతో న్యాయవాదితో మాట్లాడాలని, ఆమెను ఇంటికి తీసుకెళ్లాడు. తనకు పెళ్లి కాలేదని, వివాహం చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేశాడు. ఈ క్రమంలో యువతి గత ఏడాది జూలైలో గర్భందాల్చడంతో ఆమెతో బలవంతంగా అబార్షన్ మాత్రలు మింగించాడు. గతేడాది ఆగస్టులో యువతి సుధాకర్‌రెడ్డికి ఫోన్ చేయగా.. అతడి భార్య లిఫ్ట్ చేసి.. తాను సుధాకర్‌రెడ్డి భార్యనని చెప్పింది. యువతి అతడిని నిలదీయడంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. భార్యాభర్తలు ఆమెను బెదిరించారు. యువతితో తెగతెంపులు చేసుకోవడానికి మరో కానిస్టేబుల్ సాయంతో ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేశాడు. సుధాకర్ యువతిని గత ఏడాది డిసెంబరు 16న బైక్‌పై రాయిలాపూర్ గ్రామం వైపు తీసుకెళ్లి కిందకు తోసేశాడు. గాయపడిన ఆమె మేడ్చల్ సీఐకి ఫిర్యాదు చేసింది. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో సుధాకర్‌పై బదిలీవేటు వేశారు. న్యాయం చేయాలని బాధితురాలు ఈనెల 3న కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది.

రిమాండ్‌కు తరలించాం

సుధాకర్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించామని ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అతడి భార్య సింధూజ, మరో కానిస్టేబుల్ కళ్యాణ్‌గౌడ్‌పై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.